ప్రజాశక్తి

గురువారం 4 సెప్టెంబర్ 2025

8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా





రైతు పరిస్థితి దయనీయం

- తెల్లవారుజాము నుండే క్యూ
- సాయంత్రం వరకు పడిగాపులు
- మహిళా రైతులు బయటకు రావాల్సిన దుస్థితి
- అరకొరగానే యూరియా సరఫరా
- పలుచోట్ల నిరసనలు



పామర్రులో యూరియా కోసం బారులు తీరిన మహిళా రైతులు

రోజులు గడుస్తున్నా రైతులకు యూరియా కష్టాలు మాత్రం తీరడం లేదు. పలు విక్రయ కేంద్రాల వద్ద రైతులు తెల్లవారుజాము నుండే బారులు తీరుతున్న దయనీయ పరిస్థితి నెలకొంది. ఉదయం నుండి సాయంత్రం వరకు పడిగాపులు పడుతున్న దీనస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల మహిళా రైతులు కూడా క్యూలో నిలబడి యూరియా కోసం వేచి ఉండడం పరిస్థితి తీవ్రకు అద్దం పడుతోంది. బయట మార్కెట్లో కొనలేక, ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా అందక నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు యూరియా కొరత లేదని ప్రకటనలు గుప్పిస్తున్నా రైతులకు మాత్రం చేరడంలేదు. అధికారుల ప్రజాప్రతినిధుల ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికీ పొంతన లేకుండా పోతోంది. పంపిణీ కేంద్రాలకు వచ్చిన యూరియా కూడా అందరికీ అందకపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని పలు విక్రయ కేంద్రాల వద్ద బుధవారం కూడా రైతులు యూరియా కోసం బారులు తీరారు. కృష్ణాజిల్లా పామర్రు, ఉయ్యూరు, అవనిగడ్డ, ఘంటసాల, మోపిదేవి, ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కంభంపాడుల్లో రైతులు నిరసన తెలిపారు. మరోవైపు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ నందిగామలోని పలు విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా పోలీసులు కూడా రంగంలోకి దిగి పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. కాగా, రైతుల అవసరాలకు సరిపడా యురియా సరఫరా చేయాలని సిపిఎం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కార్యదర్శులు వై.నరసింహారావు, డి.వి.కృష్ణ డిమాండ్ చేశారు. రైతులు పడుతున్న ఇబ్బందులను దష్టిలో ఉంచుకుని సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు.

(పూర్తి వివరాలు 5వ పేజీలో)



అవనిగడ్డలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

నలుగురు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అవార్డులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): గురుపూజోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఈ ఏడాది కృష్ణాజిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. నాగాయలంకకు చెందిన డాక్టర్ కె.ఉదయ కుమార్ (స్కూల్ అసిస్టెంట్ బయాలజీ, జడ్‌పీహెచ్‌ఎస్), మోపిదేవి మండలం టి.చంద్ర శేఖరరావు (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ కోసూరువారిపాలెం), గన్నవరంకు చెందిన వై.యశోధ లక్ష్మి (ప్రిన్సిపాల్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ జూనియర్ కాలేజ్ గర్ల్స్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం), పెదపారుపూడి మండలానికి చెందిన పద్మావతి (గ్రేడ్-2 హెడ్‌మాస్టర్, ఎస్‌జీఆర్సీఎం జడ్‌పీహెచ్‌ఎస్ దోసపాడు) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరు ఈ నెల ఐదో తేదీన జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి జిల్లా విద్యాశాఖాధికారి పివిజె రామారావు అభినందనలు తెలిపారు.



దసరా సాంస్కృతికోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

18, 19 తేదీల్లో దసరా సాంస్కృతికోత్సవాలు

బ్రోచర్ ఆవిష్కరించిన కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: అభ్యుదయ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో జరుగనున్న దసరా సాంస్కృతికోత్సవాల బ్రోచర్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వివిధ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. 'హింసారహిత సమాజం - పర్యావరణ పరిరక్షణ' అంశాలతో ఈ ఉత్సవాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని ఆయన చెప్పారు. 18వ తేదీ సిద్ధార్థ ఆడిటోరియంలో, 19వ తేదీ ఎంబి విజ్ఞాన కేంద్రంలో సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు పోటీలు కూడా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సేఫ్ సంస్థ వెబ్‌సైట్‌లో వివరాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు, యువత, స్త్రీ పురుషులుగా వివిధ విభాగాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 10వ తేదీలోగా వివరాలు నమోదు చేసుకుని పోటీలలో పాల్గొనవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు కె.స్వరూపరాణి, ఆర్.ఉషామాధవి, ఎ.సంధ్యారాణి, గోళ్ల నారాయణరావు, సుంకర అనీష్ పాల్గొన్నారు.

నిల్వలు ఖాళీ

యూరియా కోసం పెరుగుతున్న కష్టాలు



ప్రజాశక్తి - గన్నవరం : యూరియా కోసం రైతులు పడుతున్న బాధలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రాథమిక సహకార సంఘాలకు కేటాయించిన యూరియా నిల్వలు వెంటనే ఖాళీ అవుతున్నాయి. ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున ఇచ్చినా అందరికీ అందడం లేదు. దీంతో రైతులు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రైవేట్ డీలర్లు ఇదే అదనుగా భావించి ఒక్కో బస్తాపై రూ.50కి పైగా అదనంగా వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా ఇతర పురుగు మందులను అంటగడుతున్నారనే వాదన ఉంది. మరోవైపు యూరియా కొరత కారణంగా మళ్లీ దొరకదేమో అనే ఆందోళనతో రైతులు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

కేటాయింపు ఎక్కువ.. సరఫరా తక్కువ

గన్నవరం మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకు 9,650 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. అందులో వరి 7,350 ఎకరాల్లో, పత్తి 700 ఎకరాల్లో, 1050 ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న, ఇతర మెట్ట పంటలను సాగు చేశారు. సీజన్లో పత్తి, వరి పంటలకు రైతులు యూరియాను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు 7 వేల టన్నులు ప్రభుత్వం అలాట్ చేసింది. కానీ అందులో 1,500 టన్నులు మాత్రమే మండలానికి సరఫరా అయింది. దీనిలో వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలకు 1000 టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 500 టన్నులు కేటాయించారు. సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలకు వచ్చిన యూరియాను రైతులు వెంటవెంటనే కొనుగోలు చేస్తుండడంతో అక్కడ నాలుగైదు రోజుల్లోనే యూరియా ఖాళీ అవుతోంది.

వర్షాలు పడుతుండటంతో పెరిగిన డిమాండ్

కొద్ది రోజులుగా వర్షాలు పడుతుండటం, వరి నాట్లు ఊపందుకోవడంతో (మిగతా 2లో)

చేనేత వస్త్ర ప్రదర్శనకు స్పందన

- రూ.1.40 కోట్ల ఆదాయం
- చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ నగరంలో ప్రారంభించిన గాంధీ బునకర్ మేళా (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన - 2025) కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చేనేత, జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి తెలిపారు. గత సోమవారం "గాంధీ బునకర్ మేళా" (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన-2025)ను శ్రీ శేష సాయి కళ్యాణ వేదికలో ఇండియన్ హ్యాండ్ మేడ్‌తో తయారైన చేనేత మరియు హస్తకళల ప్రదర్శనను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శనను సీనియర్ ఐఎఎస్ అధికారులు కే.సునీత, సూర్య కుమారి, లావణ్య వేణి, డి. హరిత, ఏపీపీఎస్సీ చైర్మన్ అనురాధలతో కలిసి ఆమె బుధవారం స్టాల్స్‌ను పరిశీలించి, కొనుగోళ్లు చేశారు. అదేవిధంగా కొనుగోళ్లు ఏ విధంగా ఉంటున్నాయో స్టాల్స్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేఖా రాణి మాట్లాడుతూ నేతన్నలు చేతితో తయారు చేసిన వస్త్రాలను ప్రజలు కొనుగోలు చేసి ఆదరించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ఇప్పటివరకు స్టాల్స్‌లో వస్త్రాల అమ్మకాల ద్వారా కోటీ నలభై లక్షల రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనలో అన్నిరకాల చేనేత ఉత్పత్తులు ఉత్పత్తి ధరలకే అందుబాటులో ఉంచారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: గురువులు మన జీవితపు మార్గదర్శకులు, జ్ఞానదాయకులు, సమాజ నిర్మాణ శిల్పులుగా అభివర్ణిస్తూ మచిలీపట్నంలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం నిర్వహించారు. పి సాంబశివరావు, రెంటచింతల. వెంకట రమణ, డాక్టర్ పి. కిరణ్ కుమార్, బి. రామకష్ణ, వేమూరి వాణి, శివలెంక. ఉషాకిరణ్, ఐ.వి.వి. ఎన్. కుమార్ బాబు, పి.ఆర్.ఎస్.ఎమ్. ఉమాకాంత్, ఏన్.వి. కష్ణారావు,వెత్సా. సత్యనారాయణ మూర్తి లను టీచర్స్ డే సందర్భంగా ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కూన. రాంజీ, పి.వి.జె. రామరావు, జి. కిషోర్ కుమార్ ,స్టార్ విద్యా సంస్థల ఫౌండర్ మెంటర్ శ్రీరామ్,స్టార్ డైరెక్టర్ అయ్యప్ప స్వామి పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పామర్రు: విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని పామర్రు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల పరిధి నిమ్మకూరులోని గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలికలపై వేధింపులకు పాల్పడితే ఫోక్సో చట్టం కఠినంగా శిక్షిస్తుందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగించినా, చేరవేసినా, కొన్నా, అమ్మినా చట్టపరంగా తీవ్ర నేరంగా పరిగణిస్తాము అన్నారు. ఈరోజుల్లో అందరూ సెల్ ఫోన్లు వినియోగించడం వల్ల సైబర్ నేరాలు తీవ్రమయ్యాయి అని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మేజర్ అయిన వారు మాత్రమే తగు లైసెన్స్ పత్రాలతో వాహనాలను నడపాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.లక్ష్మి కుమారి,ఘంటసాల కళా పీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

నిల్వలు ఖాళీ

పత్తి, వరి చేలకు యూరియా వినియోగం ఒక్కసారిగా పెరిగింది. రైతులు సీజన్ ఆరంభానికి ముందే యూరియాను పెద్దఎత్తున కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోవడం జరిగేది. అయితే ఈసారి అందుబాటులో లేకపోవడంతో నిల్వలు పెట్టుకోలేదు. అందరికీ ఒకేసారి యూరియా కావాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి యూరియా కేటాయింపులో కోత విధిస్తోంది. ఈ కారణంగా యూరియా కొరత తీవ్ర అవుతోంది. ముస్తాబాద పిఎఎసిఎస్‌లో ప్రస్తుతం యూరియా అందుబాటులో లేదు. ఇప్పటివరకు రైతులకు ఎకరాకు రెండు బస్తాల చొప్పున మాత్రమే ఇచ్చారు. ముస్తాబాద, సావరగూడెం, జక్కులనెక్కలం గ్రామాల్లో 4,500 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇప్పటికి 800 బస్తాల యూరియా రైతులకు ఇచ్చారు. ఇంకా 80 టన్నుల యూరియా అవసరమని రైతులు చెబుతున్నారు. బుద్దవరం పీఏసీఎస్‌లో యూరియా లేకపోవడంతో ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో బస్తాకు రూ.360 నుంచి రూ.400 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. గన్నవరం, బీబీ గూడెం, పురుషోత్తపట్నం సొసైటీలకు 180 టన్నులు యూరియా వచ్చింది. పదిరోజుల క్రితం ఇండెంట్ పెట్టి నగదు చెల్లించినా ఇంతవరకు అందలేదు. వీరపనేని గూడెంలో అధికంగా కొరత ఉంది. తెంపల్లి, కేసరపల్లి గ్రామాల్లో యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వ్యవసాయేతర అవసరాలకు యూరియా వాడొద్దు

శివ ప్రసాద్, ఏవో

వ్యవసాయేతర అవసరాలకు యూరియా వాడొద్దని ఏవో శివప్రసాద్ తెలిపారు. కొరత ఉన్న నేపథ్యంలో తీసుకున్న యూరియాను వరిచేలకు మాత్రమే ఉపయోగించాలన్నారు. అవసరం లేనిచోట డంప్ చేయవద్దన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మాలన్నారు. యూరియా, ఎరువుల సక్రమ సరఫరా కోసం ప్రైవేట్ షాపుల్లోనూ, సొసైటీల్లోనూ తనిఖీలు చేస్తున్నామన్నారు. రైతులు అత్యవసరం అనుకుంటే నానో యూరియాను ఉయోగించుకుంటే కొంతవరకు మేలు జరుగుతుందన్నారు.

ప్రభుత్వం కాకి లెక్కలు

ఎస్ సాంబశివరావు, రైతు సంఘం జిల్లా నాయకులు

యూరియా సరఫరా విషయంలో ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోంది. ఒక్కో సొసైటీ పరిధిలో 2 వేల నుంచి 3 వేల ఎకరాల వరకు పంటలు సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒక్కో సొసైటీకి 100 నుండి 200 బస్తాల వరకు సరఫరా చేస్తే ఏ విధంగా సరిపోతాయి. పైగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎక్కడా యూరియా కొడతలేదని డాంభికాలు చెప్పడం విడ్డూరంగా ఉంది. రైతులకు ఎంతో అవసరమైన యూరియాను ప్రభుత్వం పూర్తిగా సరఫరా చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వమే దీనికి బాధ్యత వహించాలి. సొసైటీల వద్ద రైతులు గంటల తరబడి నిలబడితే కాళ్ల నొప్పులు రావడం తప్ప యూరియా అందటం లేదు. కొన్నిచోట్ల అడ్డదారుల్లో బస్తాలు రాత్రికి రాత్రి వెళ్లిపోతున్నాయని విమర్శ ఉంది.

స్వామిత్వ సర్వేతో కచ్ఛితమైన హద్దులు నిర్ధారణ : కలెక్టర్

ప్రజాశక్తి-కంకిపాడు : స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టి ఎలాంటి తప్పులు లేకుండా భూ రికార్డులు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం కంకిపాడులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో గుడివాడ, ఉయ్యూరు డివిజన్ల అధికారులు, సిబ్బందికి నిర్వహించిన డివిజనల్ స్థాయి స్వామిత్వ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో భూ తగాదాలను నివారించుటకు రాష్ట్ర ప్రభుత్వం స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. స్వామిత్వ సర్వే చాలా కీలకమైన పని అని, ప్రతి ఇంటిని, భూమిని సరిహద్దులతో గుర్తించి సర్వే నంబరు ఇచ్చి ఎవరికి చెందినదని నిర్ధారించాలన్నారు. మండల స్థాయిలో జరుగుతున్న స్వామిత్వ సర్వే కార్యక్రమంలో ఎంపీడీవోలు,డిప్యూటీ ఎంపీడీవోలు, మండల సర్వేయర్లు,గ్రామ సర్వేయర్లు ఒక జట్టుగా కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఎవరికైనా ఎక్కడైనా అనుమానాలు వస్తే ఎప్పటికప్పుడు స్పష్టమైన సూచనలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం తయారు చేస్తున్న భూ రికార్డులు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పకడ్బందీగా తప్పులు లేకుండా చాలా జాగ్రత్త వహించి చేయాలన్నారు. గతంలో భూములు కొలత కొలవాలంటే గొలుసుల ద్వారానో, టేపుల ద్వారాను కొలిచేవారని, ప్రస్తుతం సాంకేతికత సహాయంతో చేస్తున్న సర్వేలో ఖచ్చితత్వంతో సరైన కొలతలు ఉంటాయన్నారు. ఇళ్ళ యజమానులకు 9(2)నోటీసులు ఇచ్చి వారి నుండి అభ్యంతరాలు స్వీకరించి డాక్యుమెంట్లు పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిపిఓ జే అరుణ, సర్వే భూ రికార్డుల ఏడి జోషిలా, డి ఎల్ పి ఓ సంపత్ కుమారి, డిఎల్డిఓ రాజేష్, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, మండల, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

బోళ్లపాడు సచివాలయం సందర్శన

ప్రజాశక్తి-ఉయ్యూరు : వ్యవసాయ భూముల రీసర్వేలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ఉయ్యూరు మండలం బోళ్లపాడు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామంలో జరిగిన వ్యవసాయ భూముల రీ సర్వే కార్యక్రమ వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన రీ సర్వే రికార్డులు, ఎల్పిఎం రికార్డులు, రైతుల దరఖాస్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం గ్రామ సర్పంచ్ తుమ్మూరు సురేష్ రెడ్డి తండ్రి సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ వంగ శివార్జున రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గ్రామంలో రహదారి సరిగా లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, అంతేకాకుండా తమ గ్రామానికి శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో ఉయ్యూరు ఆర్డిఓ బి.ఎస్.హేలా షారోన్, తహసిల్దార్ సురేష్ కుమార్, సచివాలయం వీఆర్వో రవి, సర్వేయర్ హరీష్,సంక్షేమ కార్యదర్శి విజయ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** భూ వివాదాలు రాకుండా రీ సర్వే వేగవంతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బుధవారం పమిడిముక్కల మండలంలోని మద్రివాడ సచివాలయంను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. మద్రివాడ గ్రామంలో సర్వే భూ వివాదాలు రాకుండా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, తహసిల్దార్ నవీన్ కుమార్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పమిడిముక్కల మండలంలో అర్జీ పరిశీలిస్తున్న కలెక్టర్

మిగిలిన బార్లకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : నూతన బార్ పాలసీ 2025-28లో భాగంగా కృష్ణా జిల్లాలో మిగిలిన బార్లకు దరఖాస్తులు స్వీకరణ కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ అధికారి జి గంగాధర్ రావు, ఎక్సైజ్ సహాయ పర్యవేక్షణ అధికారి చాగలమర్రి భార్గవ తెలియచేశారు. గుడివాడలో 6, మచిలీపట్నం కార్పొరేషన్ లో 4, పెడన మున్సిపాలిటీ పరిధిలో 1, మంగినపూడి టూరిజం 1 మొత్తం 12 బార్లకు ఆన్లైన్,ఆఫ్లైన్ విధానం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సెప్టెంబర్ 15న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ డ్రా తీస్తామని వివరించారు. మచిలీపట్నం, గుడివాడ ఏరియా బార్లకు ఏడాదికి రూ.55,00,000, పెడన, మంగినపూడి బార్లకు ఏడాదికి రూ.35,00,000, ప్రతి దరఖాస్తుతో పాటు రూ.50,0000 రుసుము, రూ.10000 ప్రోసెసింగ్ ఫీజు చెల్లించాలన్నారు.

మచిలీపట్నం మెడికల్ కళాశాల సూపరింటెండెంట్‌గా సౌమిని

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నం మెడికల్ కళాశాల సూపరింటెండెంట్‌గా డా. జి. సౌమినిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆమె విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాల నుండి మచిలీపట్నం మెడికల్ కళాశాలకు బదిలీపై రానున్నారు. వచ్చే 15 రోజుల్లో ఆమె బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రి సూపరిండెండెంట్ డాక్టర్ ఆశలత స్పష్టం చేశారు. గైనకాలజీ ప్రొఫెసర్‌గా ఎంతో అనుభవం కలిగిన డా. సౌమిని మచిలీపట్నం మెడికల్ కళాశాలకు రావడం శుభపరిణామమని మచిలీపట్నం వాసులు అభినందిస్తున్నారు.



6న కురుమద్దాలిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-పామర్రు : రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు ఈనెల 6న పామర్రు మండలం కురుమద్దాలిలోని రూరల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి అధికారి డి. విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి పి.నరేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో జోయాలుక్కాస్ జ్యూవెలరీ,బందన్ బ్యాంక్ లిమిటెడ్,మెడ్ప్లస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ రామసాయి ఆఫీస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్,వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్,కురాకు ఫైనాన్సియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్,మోహన్ స్పిన్టెక్స్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్,పేటీఎం, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కంపెనీలలో ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, బి.ఫార్మసి పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువత అర్హులన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబరు 80743 70846, 63006 18985 నంబర్లను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి : సిడిపిఒ

ప్రజాశక్తి-గన్నవరం : గర్భిణీలు బాలింతలు తప్పకుండా పోషకాహారం కలిగి ఉండే ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని సిడిపిఒ జి. మంగమ్మ అన్నారు.గన్నవరం మండలంలోని ముస్తాబాద్ గ్రామంలో మంగళవారం అంగన్వాడి సెంటర్ లో పోషకాహార వారోత్సవాలు సందర్భంగా గర్భిణీలకు బాలింతలకు పోషకాహారాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగమ్మ మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు తగినంత తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగి ఉండే ఆహారం తీసుకుంటే బిడ్డకు ఆరోగ్యవంతంగానూ పుడుతుందని తల్లి బిడ్డకు సమద్ధిగా పాలు ఇవ్వచ్చని తెలిపారు. తక్కువ ఖర్చులో జామ బొప్పాయి బీట్రూట్ క్యారెట్ ములగ ఆకు, పాలు, గుడ్లు,తీసుకోవాలని సూచించారు అలాగే అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే బాల సంజీవని పాలు గుడ్లు తప్పనిసరిగా తీసుకుని సక్రమంగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సిహెచ్ నాగ పద్మావతి, అంగన్వాడి కార్యకర్తలు, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ గ్రామీణ వైద్యుల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - గుడివాడ : రూరల్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం, ఏపి. ఆర్ఎంపి రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక పామర్రురోడ్డులోని పెద్దకాలువ సెంటర్‌లో నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. ఇటీవల నందిగామలో జరిగిన సమావేశంలో ఫెడరేషన్ అధ్యక్షుడు యామర్తి నాగేశ్వరావు ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర అధ్యక్షులుగా నండూరి ఉమాశంకర్, ఉపాధ్యక్షులుగా సాగిరాజు ఉదయభాస్కరరాజు, ప్రధాన కార్యదర్శిగా దాసు వెంకటనాగేశ్వరరావు, కార్యదర్శు లుగా పోలా సింహాచలం, గుదే నాగచంద్రశేఖర్ (నాని), సహాయ కార్యదర్శులుగా కంబాల శ్రీనివాసరావు, నండూరి శ్రీనివాస్, సలహా మండలి చైర్మన్ కోలా వెంకటేశ్వరరావు, క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ వేదాంతం మోహన ధన్వంతరి, కార్యవర్గ సభ్యులుగా చీకుర్తి ప్రదీప్‌కుమార్, పోలన అశోక్‌లు ఎన్నికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణా జిల్లా సంఘం నాయకులు అగ్నిహోత్రం ఫణి గోపాల్, ఘంటా చంటి, చల్లా చంద్రశేఖర్, లాల్ అహ్మద్, బొల్లవరపు రాజు, మేడూరి రమేష్ బాబు తదితరులు నూతనంగా ఎన్నికైన నాయకులను అభినందించారు.



రూరల్ గ్రామీణ వైద్యుల నూతన కార్యవర్గం


ఉమాశంకర్


భాస్కరరాజు

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రవాస భారతీయుడు, రాజా కళాశాల పూర్వ విద్యార్థి మండల శేషగిరి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయమని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ అన్నారు. చల్లపల్లి రాజా కళాశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని గంజాల అశ్విని, 9వ తరగతి విద్యార్థి పోతర్లంక ధనుష్ కు శేషగిరి ల్యాప్‌టాప్‌లు అందజేశారు. చల్లపల్లి రాజా కళాశాల, మోపిదేవి మొవ్వ, బట్లపెనుమర్రు, తాళ్లపాలెం, తవిసిపూడి జిల్లా ఉన్నత పాఠశాలలో స్టెమ్ ఎడ్యుకేషన్‌కు శేషగిరి సహకారం అందిస్తున్నారు. ఆయా పాఠశాలలో విద్యార్థులకు సగం ధరకే లాప్టాప్‌లు అందిస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ సుదర్శన్ ప్రసాద్, టి ఎన్ వి శాస్త్రి,టి రేణుక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ కమిటీ చైర్మన్‌గా రాజబాబు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని అంగలూరు శ్రీ రామాలయ కమిటీ చైర్మన్‌గా తిపిర్నేని రాజబాబును గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నియమించారు. చైర్మన్ రాజబాబుతో పాటు సభ్యులు బొప్పన వెంకట సత్య నాగభూషణం, కె.కోటేశ్వరరావు, కందుల ఏడుకొండలు, త్రిపురనేని మాలతి, లోయ వీర వెంకట వరలక్ష్మి, చప్పిడి వీరమ్మ, పలగాని మహాలక్ష్మికు ఎమ్మెల్యే రాము శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులు వారిని ఘనంగా సత్కరించారు. మాజీ జెడ్పీ టీసీ కొసరాజు బాపయ్య చౌదరి, కూటమి నాయకులు వల్లభనేని వెంకట్రావు, కొడాలి రామరాజు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-పామర్రు : పామర్రు కు చెందిన భోగి శ్రీనివాసరావుకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తన కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ నుండి వచ్చిన 72,820 రూపాయల నగదు చెక్కును బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, చాట్ల పెద్ద రమేష్,కాటూరి శ్రీనివాసరావు, మంతెన రామాంజ నేయులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా



పేపర్ నాయుడిని సత్కరిస్తున్న దృశ్యం

పేపర్ నాయుడుకు సత్కారం

ప్రజాశక్తి-ఘంటసాల : గత 42 సంవత్సరాలుగా ఉదయాన్నే చలిని, వానను లెక్కచేయకుండా పేపర్ వేసిన తాడేపల్లి గ్రామానికి చెందిన పేపర్ నాయుడు సేవలు అభినందనీయమని టిడిపి సీనియర్ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. బుధవారం ఘంటసాల మండల పరిధిలోని తాడేపల్లిలోని పరుచూరి సుభాష్ చంద్రబోస్ స్వగహంలో నాయుడును దుస్సాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి స్వీట్లు అందజేసి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా పరుచూరి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ పేపర్ నాయుడు (వెంకటేశ్వరరావు) ఘంటసాల మండలంలోని కొడాలి, వేములపల్లి, ఘంటసాలపాలెం, దేవరకోట, కొత్తపల్లి తదితర గ్రామాలకు గత 42 సంవత్సరాలనుండి ఉదయాన్నే పేపర్ వేస్తూ పేపర్ నాయుడుగా అందరికి గుర్తుండిపోయారన్నారు. పాఠకులకు సకాలంలో పేపర్ అందించడంలో ఆయన చేసిన కషి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యార్లగడ్డ వీరభద్రరావు, సూరపనేని శివరామ ప్రసాద్, మొవ్వ శ్రీరామ్మూర్తి, కొడాలి లక్ష్మణ్, అరవపల్లి శేష బాపయ్య పాల్గొన్నారు.

వైద్య పరికరాలు, ఫర్నీచర్ వితరణ

ప్రజాశక్తి ఉయ్యూరు : గండిగుంట పంచాయతీ పరిధి ఆనందపురంలో 104 సిబ్బందికి వైద్యసేవలందించేందుకు అవసరమైన రూ.10వేలు విలువచేసే వైద్యపరికరం, ఫర్నీచర్ ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ ఆధ్వర్యంలో దాత గొల్లనపల్లి రవి సహకారంతో ఎమ్మెల్యే బోడెప్ర సాద్ కుమారుడు బోడె వెంకట్రామ్ బుధవారం అందజేశారు. 104 సిబ్బందికి బీపీ మిషన్, ఇనుప అలమర, కుర్చీలు వితరణగా అందజేసిన రవిని వెంకట్రామ్, ప్రవీణ్, చినఓరాల పీహెచ్సీ డాక్టర్లు తేజశ్రీ, ఇంద్రావతి



నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

కార్పొరేటర్ బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

రేషన్ డిపోల్లో నాణ్యమైన బియ్యం, కందిపప్పు, పామాయిల్, చింతపండు వంటి నిత్యావసర వస్తువులు 14 రకాలు అందించి ధరల భారాల నుండి పేద ప్రజలను రక్షించాలని కార్పొరేటర్ బి. సత్యబాబు తెలిపారు. డివిజన్‌లోని 52వ డిపోలో బుధవారం ఈ-రేషన్ పంపిణీ విధానాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. స్మార్ట్ కార్డు జారీకి వినియోగిస్తున్న సర్వర్ సక్రమంగా పని చేయకపోవడం వల్ల వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్వర్లు సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రేషన్ కార్డులు, స్మార్ట్ కార్డులు మంజూరు చేసే ప్రక్రియ నిరంతరం జరగాలని కోరారు. ఇతర జిల్లా నుండి వలస వచ్చిన రేషన్ కార్డుదారులకు వారు నివాస ప్రాంతాల్లోని సచివాలయం పరిధిలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

దుర్గమ్మను దర్శించుకున్న బుల్లిరాజు

ప్రజా శక్తి - విజయవాడ సిటీ

సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలో హీరో వెంకటేష్ కొడుకుగా నటించిన బుల్లిరాజు విజయవాడ కనకదుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనం అనంతరం బుల్లి రాజుకు ఆలయ ఈవో శీనానాయక్ అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

గాంధీ పార్కు గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

శతాబ్దం చరిత్ర కలిగిన గాంధీ పార్క్ గ్రంథాలయం పునరుద్ధరించాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కన్వీనర్ ఏ వెంకటేశ్వరరావు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో 1926లో నగర ప్రజలకు విజ్ఞానం అందించేందుకు మద్రాస్ ప్రెసిడెన్సీ పాలనలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం నేటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూసివేతకు గురైందన్నారు. ప్రతిరోజు వందల సంఖ్యలో పార్కు వచ్చే వాకర్స్‌కు, ప్రజలకు ఈ గ్రంథాలయం ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. ప్రజల విజ్ఞానాన్ని పెంపొందించే గాంధీ పార్కు గ్రంథాలయాన్ని స్టోర్ రూమ్‌గా మార్చడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి గ్రంథాలయాన్ని పునరుద్ధరించాల్సిందిగా కోరారు.

ఫార్చ్యూన్ వ్యాలీ, ఫార్చ్యూన్ ప్యారడైజ్ ప్రాజెక్టులు ప్రారంభం

- హరివిల్లు డెవలపర్స్ చైర్మన్ లక్ష్మణ చౌదరి

విజయవాడ : గత ఆరేళ్లగా విజయవాడ తదితర ప్రాంతాల్లో దాదాపు 16 ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తి చేసుకొని, 17, 18వ ప్రాజెక్టులుగా ఆగిరిపల్లిలో "ఫార్చ్యూన్ వ్యాలీ", పరిటాలలో "ఫార్చ్యూన్ ప్యారడైజ్" వంటి ఎపి సిఆర్‌డిఎ అప్రూవ్డ్ ప్రాజెక్టులను ప్రారంభించినట్లు హరివిల్లు ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ వేములపల్లి లక్ష్మణ చౌదరి తెలిపారు. తమ కష్టమర్ల మన్ననలతోనే విజయవాడ రియల్ ఎస్టేట్ రంగంలో అగ్రగామిగా ఎదగగలిగామని, ఇప్పుడు వారి సౌకర్యార్థం పంట కాలువ రోడ్డులో మరో నూతన బ్రాంచ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హరివిల్లు నూతన బ్రాంచ్ మేనేజర్‌గా రామిశెట్టి హరిప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రామిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధి కోసం అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఇఒ జాస్తి ప్రసన్న చౌదరి, అడ్మిన్ మేనేజర్ నిడదవోలు పద్మజ, పబ్లిక్ రిలేషన్‌షిప్ మేనేజర్ వీరేంద్ర పాల్గొని హరిప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

మహిళల హక్కుల కోసం నిరంతర పోరాటం : ఐద్వా

ప్రజాశక్తి-విజయవాడ

రాణిగారి తోట 17,18 వ డివిజన్ల అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మహా సభ గుంటూరు బాపనయ్య భవన్‌లో బుధవారం జరిగింది. 15 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా వై. దుర్గ, తాళ్లూరి జయశ్రీ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా తమ్మిన దివ్య, సహాయ కార్యదర్శి గా వై. ఆదిలక్ష్మి, కే. కపా, కోశాధికారిగా ఎస్. ప్రవళిక, కమిటీ సభ్యులుగా టి.రామ, వి. రంగమ్మ కె. బంగారమ్మ, కె ఇందిరా ఉన్నారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కె. శ్రీదేవి మాట్లాడుతూ మహిళల సమస్యలపై ఐద్వా రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారు. నేడు కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని టిడిపి కూటమి పాలనలో మహిళలపై అరాచకాలు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా నూతన కమిటీ పని చేయాల్సి ఉందని అన్నారు. రాణిగారితోట ఏరియాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పని చేయడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి ఐద్వా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర నాయకులు మాతంగి రత్నమాల, కాయల కుమారి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న శ్రీదేవి

59వ డివిజన్ ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులుగా ఉదయం, సుజాత

సింగ్‌నగర్ 59వ డివిజన్ ఐద్వా మహాసభ లీలా సుందరయ్య భవన్‌లో జరిగింది. మహాసభలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. కమిటీ గౌరవ అధ్యక్షులుగా బుజ్జమ్మ, అధ్యక్షులుగా ఉదయం, కార్యదర్శిగా జి.సుజాత ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా దివ్య, ఉపాధ్యక్షులుగా చైతన్య, లక్ష్మీ ఎన్నిక కాగా, కమిటీ సభ్యులుగా అనిత, మార్తమ్మ , సుగుణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఐద్వా సెంట్రల్ సిటీ కార్యదర్శి రూపోస్, యుటిఎఫ్ నాయకులు పద్మ మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం ఐద్వా రాజీలేనిపోరాటం చేస్తుందని అన్నారు. స్థానికంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నూతన కమిటీ పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఓలా, ఊబర్, ర్యాపిడో కమీషన్లు పెంచాలి

- దుర్గారావు డిమాండ్

ప్రజాశక్తి-విజయవాడ

ఓలా, ఊబర్, ర్యాపిడో కమిషన్ల రేట్లు పెంచాలని, ప్రభుత్వమే ఉచిత యాప్ ఏర్పాటు చేయాలని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు కోరారు. ఈ మేరకు యూనియన్ గత సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఇచ్చిన మెమోరాండానికి స్పందించి బుధవారం ట్రాన్స్ పోర్ట్ కార్యాలయంలో ఆర్.టి.వో ఆర్.ప్రవీణ్ సమక్షంలో ఓలా, ఊబర్, ర్యాపిడో సంబంధిత అధికారులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ... ఓలా, ఊబర్, ర్యాపిడో కమీషన్లుపెంచాలని కోరారు. అంతేగాక ప్రభుత్వమే ఉచిత యాప్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఓలా, ఊబర్, ర్యాపిడో యాజమాన్యంతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆర్‌టిఓ స్పందిస్తూ ... వెంటనే ఆయా సంస్థల యాజమాన్యంతో మాట్లాడి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీని ఇచ్చారు.



ఆర్‌టిఓతో చర్చలు జరుపుతున్న సిఐటియు నేతలు

పరిశుభ్రమైన నగరం విజయవాడ

- గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫెసిలిటీని పరిశీలించిన అంతర్జాతీయ బృందం

ప్రజాశక్తి-విజయవాడ

పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రమైన నగరంగా విజయవాడ ఉందని గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫెసిలిటీ, యూనిడో ప్రాజెక్టు పరిశీలనకు విచ్చేసిన అంతర్జాతీయ బృందం పేర్కొన్నది. రామలింగేశ్వర నగర్ 20 ఎంఎల్‌డి సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పునరుద్ధరీకరణ, బయోగ్యాస్ ఎనర్జీ ప్లాంట్ ప్రాజెక్ట్ పురోగతిపై జిఇఎఫ్, యునిడో పరిశీలకుల బృందం, నగర కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం విఎంసి ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ ప్రాజెక్టు ద్వారా నగరంలోని కాలుష్యం తగ్గించేందుకు రూ.14.93 కోట్లు ఇచ్చినందుకు జెఫ్, యునిడో అంతర్జాతీయ, జాతీయ పరిశీలకుల బందానికి కమిషనర్ ధన్యవాదాలు తెలిపారు. జెఫ్,యునిడో నిధులతో పాటు, నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుండి రూ.4.93 కోట్ల చేపట్టిన ఎస్ టి పి, బయోగ్యాస్ ఎనర్జీ ప్లాంట్ పరిస్థితులతో పాటు నగర భౌగోళిక పరిస్థితులను బృందానికి కమిషనర్ వివరించారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

విజయవాడ : భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని విజయవాడ తూర్పు నగర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి నాగమల్లేశ్వరరావు తెలిపారు. విజయవాడ బెంజ్ సర్కిల్ ముత్రా కార్మికుల అడ్డా వద్ద ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలు ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. 1214 జీవో రద్దు చేసి సంక్షేమ బోర్డులోని సంక్షేమ ఫలాలు భవన నిర్మాణ కార్మికులకు అందించాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 14 నెలలైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో అసంఘటిత నిర్మాణ కార్మికులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న విజయవాడలో ఉన్న రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడికి పిలుపునిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి దుర్గారావు, రామకృష్ణ, ఏడుకొండలు, వెంకన్న, ఎ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు



ఎరువులపై ప్రతి శుక్రవారం డయల్ యువర్ కలెక్టర్

విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లాలో ఖరీఫ్ - 2025 సీజన్‌కు సంబంధించి ఎరువుల సరఫరాపై సమస్యలు, ఫిర్యాదులతోపాటు సలహాలు, సూచనలు అందించేందుకు ప్రతి శుక్రవారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అవసరాల మేరకు సమృద్ధిగా ఎరువులు ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం పూర్తి సమన్వయంతో ఎరువుల సరఫరాకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఫిర్యాదులు, సమస్యలను 91549 70454 నంబర్‌కు ఫోన్‌చేసి నేరుగా కలెక్టర్‌కు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. రైతులతో పాటు డీలర్లు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులు...ఎవరైనా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా కలెక్టర్‌తో నేరుగా మాట్లాడవచ్చని పేర్కొన్నారు.

ముసాఫిర్ ఖానా కబ్జాకు కూటమి ప్రభుత్వం యత్నం

- పోతిన మహేష్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

పంజా సెంటర్‌లో ముసాఫిర్ ఖానాను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు టిడిపి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని వైసిపి విజయవాడ, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకు పోతిన మహేష్ ఆరోపించారు. ముసాఫిర్ ఖానాను అభివృద్ధి చేసిన తరువాత ప్రైవేట్ వ్యక్తులపై ధారాదత్తం చేసేందుకు ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. ముసాఫిర్ ఖానాను ఏ విధంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడతారో ముస్లిం సమాజానికి స్థానిక ఎమ్మెల్యే, ఎంపి కేశినేని చిన్ని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరి ఆమోదంతో ఈ ఆక్షన్ నోటీసును పేపర్లో ప్రచురించారో చెప్పాలని డిమాండ్ చేశారు.


బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మైలవరం : బాలిక అదృశంపై మైలవరం పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మైలవరం శాంతినగర్‌లో నివాసముండే 14 ఏళ్ల బాలిక నాలుగు రోజులుగా కనిపించడంలేదు. గత నెల 31వ తేదీ నుంచి బాలిక ఆచూకీ తెలియడంలేదు. జి కొండూరు మండలం పినపాకకు చెందిన బాలిక పెద్దమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

దొంగతనం కేసులో వ్యక్తికి జైలు

ప్రజాశక్తి-విజయవాడ

సెల్ ఫోన్ దొంగతనం కేసులో నిందితునికి ఏడు నెలలు జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. గత ఏడాది మే 20 రాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తనను బెదిరించి జేబులో ఉన్న సెల్ ఫోన్ లాక్కొని పారిపోయిన సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాది మేరకు సూర్యారావు పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గతేడాది మే 22న చుట్టుగుంటకు చెందిన ఉప్పు దుర్గారావును పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఏడు నెలల జైలు శిక్ష, రూ.1500 జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.



ఘంటసాల మండలం లంకపల్లిలో బారులుతీరిన రైతులు



ఎ.కొండూరు మండలం కంభంపాడులో రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

తప్పని యూరియా తిప్పలు

• విక్రయ కేంద్రాల వద్ద పడిగాపులు • గంటల తరబడి బారులు తీరిన రైతులు

ప్రజాశక్తి - పామర్రు, ఉయ్యూరు, ఘంటసాల, అవనిగడ్డ, కోడూరు, మోపిదేవి, ఎ.కొండూరు : యూరియా కోసం బుధవారం కూడా కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని పలు విక్రయ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరారు. అయినా అందరికీ అందకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరతతో పిఎసిఎస్‌లు, గ్రోమోర్ సెంటర్ల వద్ద రైతులు దయనీయ పరిస్థితుల్లో పడిగాపులు కాయాల్సి వస్తోంది.

పామర్రులో మహిళలు సైతం క్యూ

పామర్రు గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రానికి రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎరువుల కోసం ఎగబడ్డారు. కొందురు మహిళలు కూడా పురుషులతో పోటీపడ్డారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ట్రైనీ ఎస్ఐ సత్యకళ తన సిబ్బందితో విక్రయకేంద్రం వద్దకు చేరుకుని రైతులను వరుస క్రమంలో నిలబడేలా చర్యలు తీసుకున్నారు. వ్యవసాయ అధికారిని శివ నాగవాణి ఎరువుల విక్రయాలను పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరికి కట్ట యూరియా చొప్పున అందేలా చర్యలు తీసుకున్నారు. గ్రోమోర్ కేంద్రానికి 25 టన్నుల యూరియా వచ్చిందని, ప్రతి రైతుకు ఆధార్ కార్డు నమోదు చేసుకుని సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నాలుగు రోజుల్లో పిఎసిఎస్‌లకు పూర్తిస్థాయిలో యూరియా వస్తుందని తెలిపారు.

ఉదయాన్నే పంపిణీ కేంద్రానికి వచ్చిన రైతులు

అలాగే ఉయ్యూరులోని మన గ్రోమోర్ షాపుకు యూరియా వచ్చిందని తెలుసుకున్న పలు గ్రామాల రైతులు ఉదయాన్నే అక్కడికి పెద్దఎత్తున తరలివచ్చి క్యూలో నిలబడ్డారు. మండల వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్, రెవిన్యూ సిబ్బంది ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా కూపన్లు ఇచ్చి ఎకరాకు అరకట్ట చొప్పున యూరియా పంపిణీ చేశారు. మనగ్రోమోర్‌కు 35 టన్నుల యూరియా వచ్చిందని, ఎకరానికి అరకట్ట చొప్పున 20 ఎకరాలు అంత కంటే ఎక్కువ పొలం సాగుచేస్తున్నవారికి 8 కట్టలు మించకుండా పంపిణీ చేస్తున్నామని నిస్సీగ్రేస్ తెలిపారు.

అవనిగడ్డ కార్యాలయం వద్ద అధికారుల నిలదీత

అవనిగడ్డ పిఎసిఎస్, అశ్వారావుపాలెం, వేకనూరు రైతు సేవా కేంద్రాలకు మంగళవారం రాత్రి యూరియా వచ్చిందని తెలియడంతో తెల్లవారుజాము నుండే ఆయా కేంద్రాల వద్ద రైతులు బారులు తీరారు. అయితే మోదుమూడిలో 450 మంది రైతులకుగాను కేవలం 200 బస్తాలు, అశ్వారావుపాలెంలో 600 మందికిగాను 150 కట్టలు, అవనిగడ్డ పిఎసిఎస్ పరిధిలో 2 వేల మందికి కేవలం 176 కట్టలు, వేకనూరులో 900 మందికిగాను 270 కట్టలు మాత్రమే యూరియా సరఫరా అవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవనిగడ్డలోని మన గ్రోమోర్ షాపు వద్దకు రైతులు ఉదయమే చేరుకున్నా ఆ షాపు యజమానులు షట్టర్లు మూసేసి వెళ్లిపోయారు. యూరియా అందరికీ అందకపోవడంతో రైతులు మూకుమ్మడిగా అవనిగడ్డ కార్యాలయం వద్దకు వెళ్లి అధికారులను నిలదీశారు. వేకనూరులో కొద్దిసేపు ధర్నా నిర్వహించారు.

పిఎసిఎస్‌ల వద్ద పడిగాపులు

ఘంటసాల మండలంలోని పలు పిఎసిఎస్‌లకు మంగళవారం రాత్రి యూరియా వచ్చిందని తెలుసుకున్న లంకపల్లి, ఘంటసాల గ్రామాల రైతులు ఉదయం 6 గంటల నుంచి ఆయా పిఎసిఎస్‌ల వద్దకు చేరుకున్నారు. గంటల తరబడి పడిగాపులు పడ్డారు. కార్యాలయాల ముందు అధిక సంఖ్యలో వేచి ఉండడాన్ని గమనించిన అధికారులు కార్యాలయాల గేట్లు తెరవకుండా రైతులను బయట నిలబెట్టారు. మధ్యాహ్నం నుంచి క్యూ పద్ధతిలో యూరియా పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు ఒక కట్ట మాత్రమే పంపిణీ చేశారు. మండల తహశీల్దారు విజయప్రసాద్ మాట్లాడుతూ లంకపల్లి సొసైటీకి 445, ఘంటసాల సొసైటీకి 555 యూరియా కట్టలు వచ్చాయని, వాటిని రైతులకు పంపిణీ చేశామన్నారు.

నిరాశగా వెనుదిరిగిన రైతులు

మండల కేంద్రమైన మోపిదేవిలో రైతులు తెల్లవారుజాము నుండే యూరియా కోసం పడికాపులు పడ్డారు. ఒక్కో రైతుకు రెండు కట్టల చొప్పున పంపిణీ చేశారు. మధ్యాహ్నానికి నిల్వలు అయిపోవటంతో చాలామంది రైతులు నిరాశగా వెనుదిరిగారు.

భద్రాచలం జాతీయ రహదారిపై నిరసన

ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కంభంపాడులోని గ్రోమోర్ కేంద్రంలో యూరియా అమ్ముతున్నారని తెలుసుకున్న రైతులు వందల సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆధార్ తీసుకొని డిబిటి పద్ధతి ద్వారా యూరియా అందించడంతో పంపిణీ ఆలస్యంగా సాగింది. దీంతో రైతులు రైతు సంఘం ఆధ్వర్యాన విజయవాడ - భద్రాచలం జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల నాయకులు రావుల రామకృష్ణ, సిఐటియు నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ఏడు పిఎసిఎస్‌లకు ప్రభుత్వం యూరియాను సరఫరా చేసి ఉంటే రైతులు ఒక్క యూరియా కట్ట కోసం రోజంతా నిరీక్షించాల్సి వచ్చేది కాదన్నారు. పంపిణీలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో డి రాము, కె.నాగేశ్వరరావు, ఆర్.వాసు, పి.కృష్ణ, డి రామకష్ణ, కె.శ్రీను, పి.వెంకటేశ్వరరావు, బాబు, సిహెచ్.కృష్ణ, ఎం.కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా ఎరువుల బులిటెన్

ఎన్‌టిఆర్ జిల్లాలో బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి మొత్తం 48,158 టన్నుల ఎరువులు రైతులకు సరఫరా చేశారు. ప్రస్తుతం జిల్లాలో అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలిలా ఉన్నాయి.

ఎరువులు	టన్నుల్లో
యూరియా	3,474
డిఎపి	1,311
మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ)	1,246
ఎన్‌పికె	12,948
ఎస్ఎస్‌పి	2,195
కంపోస్ట్	83
ఎఫ్ఒఎం	30
మొత్తం	**21,289**

ఎరువుల దుకాణాల్లో కలెక్టర్ తనిఖీలు



ప్రజాశక్తి- నందిగామ : ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ బుధవారం నందిగామ డివిజన్‌లో పర్యటించి ఎరువుల విక్రయ కేంద్రాల్లో విస్తత తనిఖీలు చేపట్టారు. నందిగామలో గ్రోమోర్ ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈసంద ర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎరువుల సరఫరాపై ఫిర్యాదులు లేదా సమాచారం అందించేందుకు ప్రతి షాపు వద్ద 91549 70454 నంబరును డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శిం చాలన్నారు. ఎరువుల నిల్వలు, అమ్మకాలు, ధరల వివరాలను నోటీస్ బోర్డులో తప్పని సరిగా పొందుపరచాలని ఆదేశిం చారు.

దుకాణాల్లో పోలీసుల తనిఖీలు : పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు బుధవారం ఎన్‌టిఆర్ జిల్లాలోని పలు ఎరువుల దుకాణాలు, గోడౌన్లను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా నిల్వలపై ప్రత్యేక దష్టి సారించి బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకునట్లు పోలీసులు తెలిపారు. ఏ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

యూరియా సరఫరా పెంచాలి

సిపిఎం కృష్ణా, ఎన్‌టిఆర్ జిలాల్ల కార్యదర్శులు వై.నరసింహారావు, డివి కృష్ణ

ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్/విజయవాడ : రైతుల అవసరాలకు సరిపడా యురియా సరఫరా చేయాలని సిపిఎం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కార్యదర్శులు వై.నరసింహారావు, డివి కృష్ణలు డిమాండ్ చేశారు. యూరియా కోసం జిల్లా వ్యాప్తంగా రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని వారికి సరిపడా సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు. తెల్లవారుజాము నుంచే రైతులు సొసైటీల, రైతు సేవా కేంద్రాలు, గ్రోమోర్ షాపుల వద్ద పడికాపులు పడుతున్నారని వివరించారు. క్యూలైన్లో వేచి ఉన్న ప్రతి రైతుకూ యూరియా అందు తుందన్న గ్యారెంటీ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు లకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. యూరియా సరఫరా చేసి రైతుల అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

అందుబాటులో 1,443 టన్నుల యూరియా కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగుతొందని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1,443 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. సెప్టెంబర్ 1న జిఎస్ఎఫ్‌సి వారి ద్వారా 243 టన్నులు, 2న సిఐఎల్ నుండి 1,200 టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. రాబోయే 10 రోజుల్లో మరో 4 వేల టన్నుల యూరియా జిల్లాకు రానుందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో 08672 252572 నంబర్తో ఒక కంట్రోల్ విభాగం ఏర్పాటు చేశామని, రైతులు ఎవరైనా సరే యూరియా సరఫరాలో ఇబ్బందులుంటే ఈ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

ఆధార్ కార్డు ద్వారా సరఫరా చేయాలి

• కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి


ప్రజాశక్తి-ఉంగుటూరు : పిఎసిఎస్‌లలో ఆధార్ కార్డు గుర్తింపుగా పెట్టుకుని రైతులకు, కౌలు రైతులకు యూరియా సరఫరా చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి కోరారు. కొన్ని పిఎసిఎస్‌లలో కచ్చితంగా పాస్ పుస్తకం లేదా అడంగుల్ కాపీ కౌలు గుర్తింపు కార్డు ఉంటేనే యూరియా సరఫరా చేస్తామని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. చాలాచోట్ల కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వలేదని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ఏ విధంగా కౌలు రైతులకు యూరియా అందుతుందని ప్రశ్నించారు.



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

యూరియా అందించాలని ఎఒకు వినతి

ప్రజాశక్తి-పామర్రు, కోడూరు : మండలంలోని 25 గ్రామాల్లో వరి నాట్లు వేసి రెండు నెలలు దాటినా రైతులకు యూరియా అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శివ నాగేంద్రం పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు పామర్రు మండల వ్యవసాయాధికారి శివ నాగరాణిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఒడుగు గంగాధర్ ప్రసాద్, కొక్కిలిగడ్డ లక్ష్మణరావు, ఇంటి రాజు పాల్గొన్నారు. కోడూరు మండలంలోని అన్ని పిఎసిఎస్‌ల వద్ద బారులు తీరి ఉంటున్న రైతులందరికీ యూరియా అందేలా చూడాలని సిపిఎం కోడూరు మండల కార్యదర్శి పోలాబత్తిన మోహన్‌రావు డిమాండ్ చేశారు.



కోడూరులో ఎరువుల కోసం పడిగాపులు పడుతున్న రైతులు



మోపిదేవిలో...



ఉంగుటూరు మండలంలో...



పామర్రులో యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

పంచాయతీ ఆమోదం లేకుండా వేలం పాట నేరం : ఎంపిడిఒ

• ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - తిరువూరు

గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆమోదం తెలుపుతూ తీర్మానం చేసి తరువాత అధికారికంగా మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో చేపల పెంపకానికి వేలం నిర్వహించాల్సి ఉంటుందని తిరువూరు ఎంపిడిఓ రవిబాబు తెలిపారు. ప్రజాశక్తి జిల్లా పేజీలో బుధవారం వెలువడిన 'అనధికార చేపల చెరువులకు వేలం' కథనానికి ఎంపిడిఓ స్పందిస్తూ పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని కోకిలంపాడు గ్రామంలో ఉన్న రెండు చెరువుల్లో చేపల పెంపకానికి తమ అనుమతి లేకుండా ఎవరైనా వేలం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలోని తాళ్ళ చెరువులో, కొత్త చెరువులో చేపల పెంపకానికి కొంతమంది నాయకులు వేలం నిర్వహించగా రూ.9.60 లక్షలకు పాడుకున్నారని, ఆ సొమ్ము ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా వేలం నిర్వహించిన గ్రామ పెద్దల వద్ద ఉన్నాయని ప్రజాశక్తి ఎంపిడిఓను ప్రశ్నించగా.. ఆ వేలం చెల్లదని, గ్రామ పంచాయతీ వేలం పాట నిర్వహించే వరకు చెరువుల్లో చేపల పెంచవద్దని గ్రామస్తులకు, పెద్దలను ఆదేశించినట్లు ఎంపిడిఓ తెలిపారు.

విద్యార్థులకు ఆంగ్ల సామర్థ్య పరీక్ష

ప్రజాశక్తి - తిరువూరు

విద్యార్థులు మాతృభాషతో పాటు, ఆంగ్ల భాష కూడా నేర్చుకోవాలని, అప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎ కొండూరు మండల విద్యాశాఖాధికారి ఈలప్రోలు కేశవరావు అన్నారు. మండల పరిధిలోని కోడూరు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఇంగ్లీష్ లిటరసీ అండ్ న్యూమరసి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన ఆంగ్ల భాష సామర్థ్య పరీక్షను పరిశీలించారు. విద్యార్థులకు ఇటువంటి పరీక్షలు నిర్వహించటం వల్ల వారిలో ఇంగ్లీష్ పట్ల ఆసక్తి కలుగుతుందని చెప్పారు.పరీక్షను పాఠశాల హెచ్ఎం ఎం.రాంప్రదీప్, ఉపాధ్యాయులు నాగేంద్రరావు, జయశ్రీ, సుప్రియ పర్యవేక్షించారు.

ఎరువుల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-కంచికచర్ల

కంచికచర్ల మండలంలోని పరిటాల గ్రామంలో బుధవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పంట నమోదు అవశ్యకత, గురించి అధికారులు వివరించారు. పిఎం ప్రణామ్‌లో భాగంగా రైతులకు ఎరువుల వినియోగం తగ్గించి నానో యూరియా, నానో డిపిఎ వాడకంపై రైతులకు వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ అవగాహన కల్పించారు. జీవన ఎరువుల వాడకం ప్రోత్సహించడం ద్వారా నేల సంరక్షణ, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిడిఎ వెంకటేశ్వరావు, మండల వ్యవసాయ ఆధికరి కె.విజయ్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాస్, పాల్గొన్నారు



వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - తిరువూరు

ప్రముఖ ఎరువులు, పురుగు మందుల వ్యాపారి నాగుబండి రామారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు బుధవారం వృద్ధులకు అన్నదానం చేశారు. తిరువూరులోని ఐడియాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమంలోని 40 మంది వృద్ధులకు రామారావు కుమారులు నాగుబండి ప్రకాశరావు, శ్యామ సుందరరావు, విశ్వేశ్వరరావు, మనమళ్ళు రంజిత్ , రాకేష్ అన్నదానం చేసి తమ సేవా తత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఐడియాస్ సంస్థ డైరెక్టర్ శౌరి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

• ఎన్‌సిహెచ్ శ్రీనివాస్



ప్రజాశక్తి- తిరువూరు

అన్ని రంగాల్లోని కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిఐటియు తిరువూరు మండల మహా సభ స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా సీఐటీయూ జెండాను సీనియర్ నాయకులు ఎస్.వి భద్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డును ప్రారంభించాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు విడుదల చేయాలని, ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు వాహన మిత్ర కింద రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు మరకాల ఇశ్రాయేలు, నాయకు కె.వి రావు, పుల్లారావు, వరలక్ష్మి, నాగరాజు, ముత్తమ్మ, సామ్రాజ్యం, ప్రజానాట్యమండలి నాయకులు పంబి వెంకటేశ్వరరావు, తులసి రాణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి-వత్సవాయి

మేరిసన్ రవీందర్ ఠాగూర్ డిగ్రీ కాలేజీలో గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై యువతీ, యువకులకు శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. వత్సవాయి మండలంలోని మక్కపేట గ్రామంలో పుట్టగొడుగుల పెంపకంపై డాక్టర్ కెఎల్ రావు కషి విజ్ఞాన కేంద్రం గరికపాడు డాక్టర్.ఎం.రవి కిషోర్, డాక్టర్ ఆర్.ప్రభావతి (గహ విజ్ఞాన శాస్త్రవేత్త) శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకం వల్ల యువతీ, యువకులకు ఆర్థిక స్వాలంబనలో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ స్కూల్ హెడ్మాస్టర్ వెంకటేశ్వరరావు, కాలేజ్ ప్రిన్సిపల్ క్రాంతి కుమార్, పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి-కంచికచర్ల

గంజాయి విక్రయిస్తున్న ఇరువురు వ్యక్తులను కంచికచర్ల పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కంచికచర్ల ఎస్సై పి. విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కంచికచర్ల గ్రామం గొట్టుముక్కల రోడ్డు మోడల్ కాలనీ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో ఇరువురు వ్యక్తులు గంజాయి కలిగి ఉన్నారనే సమాచారంతో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో కంచికచర్ల వసంత కాలనీకి చెందిన మంగిశెట్టి రాజేష్, నందిగామ బీసీ కాలనీకి చెందిన సంగం ఆకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వీరికి రాజమండ్రికి చెందిన నిరంజన్ రాజు అనే వ్యక్తి గంజాయి అమ్మినట్లు దర్యాప్తులో తేలిందని, వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విశ్వనాథ్ తెలిపారు.

భోజన పథకం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-నందిగామ

ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నందిగామ మహాసభ సెప్టెంబర్ 7న నందిగామలోని ఎస్‌టియు భవనంలో జరుగుతుందని సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ తెలిపారు. బుధవారం నందిగామలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు, మెనూ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు రేషనలైజేషన్ పేరుతో స్కూళ్ళ విలీనం చేయడం వలన ఉపాధి కోల్పోతున్న కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని, బడ్జెట్ పెంచాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని, సంక్షేమ చట్టాల అమలు, బడ్జెట్ పెంపు తదితర సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన కార్యాచరణను ఈ మహాసభలో రూపొందించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్, మధ్యాహ్న భోజన పథకం వర్కర్ యూనియన్ నందిగామ మండల కార్యదర్శి ఆదూరు సుశీల పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియోగంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని చిల్లకల్లు జిల్లా పరిషత్, జయంతిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నందిగామ సబ్ డివిజన్ పోలీసులు శక్తి బృందం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్, మత్తు పానీయాలపై అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గం సర్కిల్ డివిజన్ టీం, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారి విజయ్ కుమార్

ఎరువుల దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి-కంచికచర్ల

కంచికచర్ల మండలంలో ఎరువుల ప్రైవేట్ డీలర్ల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి కె విజయ్‌కుమార్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆయా ఎరువులు దుకాణాల గోదాముల్లో నిల్వ చేసిన చెరువులను పరిశీలించారు. రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీ ధరలకే విక్రయించాలని డీలర్లకు సూచించారు. యూరియాను అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే సంబంధించిన డీవర్ల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కంచికచర్ల మండలంలో యూరియా స్టాక్స్ అందుబాటులో ఉన్నాయని, రైతులు అధైర్య పడొద్దని తెలిపారు.,

చిల్లకల్లు సిడిపిఒ సరళకు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

సంపూర్ణత అభియాన్ సత్కార్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిల్లకల్లు సిడిపిఓ బి.సరళకు గోల్డ్ మెడల్ లభించింది. యాస్పిరేషనల్ బ్లాక్ విజన్ 2047లో భాగంగా పెనుగంచిప్రోలు మండలంలో గర్భిణీలు, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాలలోపు చిన్నారుల టిహెచ్ఆర్, పిల్లల బరువు, ఎత్తు, మౌలిక సదుపాయాల కల్పనలో నూరు శాతం సాధించినందుకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సంపూర్ణత అభియాన్ సత్కార్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా చేతుల మీదగా చిలకలు సిడిపిఓ సరళ, ఎసిడిపిఓ జి.సత్యవతి, గ్రేడ్ వన్ సూపర్వైజర్ ఉషారాణిలను సత్కరించారు. మండలంలోని 54 మంది కార్యకర్తలకు సంపూర్ణ అభియాన్ సత్కార కార్యక్రమం జరిగినది. పెనుగంచిప్రోలు మండలం గ్రేడ్‌వన్ సూపర్వైజర్‌గా పని చేస్తున్న ఉషారాణి సిడిపిఓగా ప్రమోషన్‌తో కందుకూరు ప్రాజెక్టుకు వెళ్లారు. ఈ సందర్భంగా వారికి పలువురు అభినందనలు తెలిపారు.

యూరియా కొరత సృష్టించొద్దు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నంలోని పలు యూరియా దుకాణాల్లో ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ అధికారిని యడవల్లి రజని, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్పి బంగారు రాజు తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకం, ఈపిఓఎస్ మిషన్, నిల్వ ఉన్నటువంటి యూరియా సంచులను తనిఖీ చేశారు. యూరియా దారి మళ్లిస్తే పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు.

జూపూడిలో భారీ పేలుడు : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

జూపూడిలోని ఓ ఇంట్లో బుధవారం రాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. స్థానికుల కథనం ప్రకారం.. జూపూడి భీమేశ్వర్ కాలని ఓ ఇంట్లో వెల్డింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అక్కడ పని చేస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. సమాచారం అందుకున్న వెంటనే వెస్ట్ జోన్ ఎసిపి దుర్గారావు, సిఐ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇంట్లో మందుగుండు సామాగ్రి తయారు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

మహిళా సమైక్య అధ్యక్షురాలిగా రజిని

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట మండల మహిళ సమైక్య అధ్యక్షురాలిగా మండలంలోని చిల్లకల్లు గ్రామానికి చెందిన నాయని రజిని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం రజినిని ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య సోదరుడు శ్రీరామ్ చిన్నబాబు జగ్గయ్యపేట పట్టణంలో 'స్త్రీ శక్తి' విజయోత్సవ సభలో ఆమెను శాలువా కప్పి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వ ఉన్నత లక్ష్యాల మేరకు కృషి చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆమెకు సూచించారు.



వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

దివిసీమ విద్యా ప్రదాత మండలి వెంకట కృష్ణారావు

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమ విద్యా ప్రదాత మండలి వెంకట కృష్ణారావు అని ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం అవనిగడ్డ వంతెన సెంటర్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలు మండలి అభిమానులు శత జయంతి ఉత్సవ కమిటీ గాంధీ క్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు విగ్రహానికి కూటమి నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, డి సీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, పిఏసిఎస్ చైర్మన్ మాదివాడ రత్నారావు, మాజీ ఎంపీపీ బం డే కనకదుర్గ, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, బండి రాఘవ, షేక్ బాబావాలి, ఎలవర్తి రాజా పాల్గొన్నారు

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిత్యాన్నదానానికి తెనాలికి చెందిన గాజుల పార్థసారథి, షణ్ముఖ ప్రియా దంపతులు రూ. 50,001 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విరాళాన్ని డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

హస్తకళల ప్రదర్శన

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : విద్యార్థులు చదువుతోపాటు హస్తకళలలో ప్రావీణ్యం పొంది ఎకో ఫ్రెండ్లీ వస్తువులు తయారు చేయాలని పెడన మండల విద్యాశాఖ అధికారిని సలోమి పేర్కొన్నారు. హస్త కళల అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పెడన కళాంజలి హై స్కూల్లో హస్తకళల ప్రదర్శన అవగాహన సదస్సు జరిగింది.ప్రిన్సిపాల్ కే దిలీప్ కుమార్ అధ్యక్షత వహించగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థి దశలో హస్త కళలు నేర్చుకోవడం ద్వారా వారిలో సజనాత్మకత పెరుగుతుందన్నారు. హస్త కళల విస్తరణ అధికారి రవీంద్ర గౌతమ్ మాట్లాడుతూ ఈ రంగంలో విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా తల్లిదండ్రులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పెడన మండల ఎంఈఓ -2 హరినాథ్, సీ.ఈ.వో టెక్స్‌వెన్‌యు హ్యాండీక్రాఫ్ట్స్ పి. ఓ జె.డి.ఎన్. శ్రీనివాస్, కళాంజలి హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు చెల్లించండి

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం నగరంలోని డిమార్ట్ నుండి వ్యవసాయ మార్కెట్ కమిటీకి మార్కెట్ ఫీజు చెల్లించాలని మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే వెంకట గురునాథ్ దుర్గా ప్రసాద్ (నాని) డిమార్ట్ యాజమాన్యాన్ని కోరారు. బుధవారం ఆయన నగరంలోని డి మార్ట్ ను పరిశీలించి డిమార్ట్ యాజమాన్యంతో మాట్లాడారు. మార్కెట్ కమిటీ గన్నవరంనకు మార్కెట్ ఫీజు ఏ విధంగా చెల్లిస్తున్నారో అదేవిధంగా మచిలీపట్నం మార్కెట్ కమిటీ వారికి కూడా మార్కెట్ ఫీజు చెల్లించాలని చైర్మన్ యాజమాన్యాన్ని కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వి భాస్కరరావు పాల్గొన్నారు.

ఇన్నర్‌వీల్ క్లబ్‌కు అవార్డు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఇన్నర్‌వీల్ క్లబ్‌కు 2024-2025 సంవత్సరానికి ఉత్తమతార అవార్డు లభించినట్టు క్లబ్ అధ్యక్షురాలు నర్రా సుధారాణి తెలిపారు. సంవత్సర కాలంలో చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా జిల్లాక్లబ్లో ఉత్తమ క్లబ్ విశాఖ పట్నంలో జరిగిన కార్యక్రమంలో 302 జిల్లా చైర్మన్ ఎ.లక్ష్మీశ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా బుధవారం స్థానిక క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో అధ్యక్ష కార్యదర్శులు సుధారాణి, అన్నేరాణి, సూర్య కుమారిలను పూలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అంగలూరు పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఏపీ ఉత్తమ పాఠశాలగా ఇటీవల సీఎం చంద్ర బాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్న మండలం లోని అంగలూరు బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే బుధవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ అంగలూరు పాఠశాల స్ఫూర్తితో నియోజకవర్గంలో మరిన్ని పాఠశాలలను ఉత్తమ పాఠశాలలుగా రూపాంతరం చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పాఠశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేశారు. ఇటీవల స్పోర్ట్స్ డే, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీ. జగన్మోహన్రావు, కర్ర సాము విద్య గురువు ముక్కు సోమేశ్వరరావులను ఎమ్మెల్యే రాము మరియు కూటమి నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, ఎంఈఓ2 గోపాలరావు, డైట్ కాలేజ్ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ,పి.వినయ్ కుమార్, గ్రామ సర్పంచ్ మేడేపల్లి రవికుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఎల్ఎ

నూతన మూల్యాంకన విధానం బోధనకు గొడ్డలిపెట్టు : ఎస్‌టియు

ప్రజాశక్తి-గన్నవరం : రోజురోజుకీ ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా ప్రవేశపెడుతున్న మార్పులన్నీ ఉపాధ్యాయుల బోధన సమయాన్ని తగ్గిస్తున్నాయని, నూతన మూల్యాంకన విధానం బోధనకు గొడ్డలిపెట్టు లాంటిదని ఎస్టీయు రాష్ట్ర కార్యదర్శి డి.విద్యాసాగర్ అన్నారు. బుధవారం గన్నవరం మండలంలో సమస్యల సేకరణ కోసం దావాజీ గూడెం, అల్లాపురం, చింతలపేట, చెంచుల కాలనీ,దుర్గాపురం, కేసరపల్లి, సుందరయ్య నగర్ పాఠశాలలను సందర్శించారు. ఈ సమావేశంలో ఎస్టీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోట్రూ ఆనంద్ కుమార్ రావెళ్ళ ఆనంద్ కుమార్ , ఆర్థిక కార్యదర్శి చిమటా కష్ణారావు, జిల్లా నాయకులు దొవరి సురేష్,బొకినాల శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుధాకరరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి-మోపిదేవి : పెదప్రోలు గ్రామ టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు మండవ సుధాకరరావు (72) బుధవారం తుది శ్వాస విడిచారు. ఆయన రెండు దఫాలుగా టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షు లుగా బాధ్యతలు చేపట్టి పార్టీని బలోపేతం చేయడంతో పాటు గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన మతి పట్ల టిడిపి నేతలు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

ఆలయాభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి దేవస్థాన పునర్నిర్మాణ పనులకు ముత్తిరెడ్డి మల్లేశ్వరరావు స్మారకార్థం కుమారుడు శ్రీనివాసరరావు రూ.55,116 విరాళం ఇచ్చారు. ఈ విరాళాల్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్ వల్లభనేని కష్ణప్రసాద్(నాని), ఆలయ ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి-పామర్రు : మండలం యలకుర్రు గ్రామంలో నిర్వహించిన "బాబు షూరిటీ మోసం గ్యారంటీ" కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలు స్కాన్ చేసి చంద్రబాబు చేసిన మోసాల గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ నాయకులతో కార్యకర్తలతోను చర్చించి గ్రామ పార్టీ కమిటీని ఏర్పాటు చేశారు. యలకుర్రు గ్రామ పార్టీ అధ్యక్షునిగా పానే కొండలరావు, ప్రధాన కార్యదర్శులుగా బడుగు నాగరాజు,దండాబత్తిన నాగరాజు, కొనకాల వెంకట్రావు, పానే సాయిబాబు కార్యదర్శిలుగా గౌపర్ణ వెంకటేశ్వరరావు, పెదపూడి వెంకటేశ్వరరావు, మేకల ఎన్నిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరావు, ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆకునూరు - కడవకొల్లు జిల్లాపరిషత్ రోడ్డు అభివద్ధికి గ్రామస్తులు, రైతులు సహకరించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆకునూరు సెంటర్ నుంచి కడవకొల్లు వరకు జిల్లాపరిషత్ రోడ్డు అభివద్ధిపై గ్రామస్తులు, రైతులతో ఆకునూరు రచ్చబండ వద్ద బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాపరిషత్ రోడ్డు జపాన్ టెక్నాలజీతో అభివద్ధి చేసేందుకు రూ.5 కోట్లు మంజూరయ్యాయని, రోడ్డు పక్కన ఆక్రణలు తొలగించేందుకు సహకరించాలన్నారు. సర్పంచ్ గోలి వసంతకుమార్, టీడీపీ నాయ కుడు అనుమోలు ప్రభాకరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడివాడ : చనిపోయిన కుమారుడు పేరు మీద ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని 1టౌన్ సిఐ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక బాపూజీనగర్‌లోని సిఎస్ఐ చర్చి సమీపంలో తూమేటి తనుజ్‌కుమార్ జయంతి సందర్భంగా తనుజ్ కుమార్ తల్లిదండ్రులు డానియల్, మరియమ్మల ఆధ్వర్యంలో శంకర నేత్ర చికిత్సాలయ సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ కొండపల్లి శ్రీనివాస్ పాల్గొని వైద్య శిబిరం ప్రారంభించారు. మాలమహానాడు జెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పొంగు లేటి జయరాజ్, తూమేటి ప్రసాద్, కనకాంబరం, బొంతు వెంకటేశ్వరరావు, బుర్ర కుమార్‌రాజా పాల్గొన్నారు.

మానవతా సేవల్లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ప్రాంతంలో మానవతా సేవ సంస్థ చేస్తున్న కార్యక్రమాలకు ప్రజలు, దాతలు, సేవా తత్పరులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆ సమస్త అధ్యక్షులు కర్రా వరప్రసాద్ కోరారు. బుధవారం గన్నవరం పట్టణంలో మానవతా సేవలో ప్రతి ఒక్కరూ హితో అధికంగా భాగస్వాములు కావాలని కోరుతూ విస్తత ప్రచారం నిర్వహించారు. వరప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో ఎంత సంపాదించామనేది ముఖ్యం కాదని, మనం సంపాదించిన దాంట్లో ఎంత సమాజ సేవకు ఉపయోగించామనేది ముఖ్యమని పేర్కొన్నారు. మంచి పనులు చేయడం ద్వారానే జీవితానికి సార్థకత చేకూరుతుందన్నారు. దాతలు ఇస్తున్న సహకారంతో లక్షలాది రూపాయలతో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీసం ప్రసాద్, బాబ్జి, మడుపల్లి బాలకష్ణ, ఇతరులు పాల్గొన్నారు.



నవరాత్రుల్లో భారీగా అన్నదానం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : సుకర్లాబాద్ పోలీస్ రామాలయం వెనక ఉన్న గణపతి నవరాత్రి పందిట్లో స్థానికంగా ఉన్న హిందూ ముస్లిం యువకులు కలిసి నవరాత్రి వేడుకలు నిర్వహించడం మతసామరస్యానికి నిదర్శనమని విగ్రహ దాత పొట్నూరి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పోలీస్ కళ్యాణ మండపం ముందు 3000 మందికి పైగా అన్నదానం చేశారు. కమిటీ కుర్రాళ్ళు ఈడే ఫణి, గంటా పవన్ సాయి, గొర్ల సతీష్, ఎండి రియాజ్, షేక్ కాజా, షేక్ గన్నైదా పర్యవేక్షణలో 20 మంది మిత్ర బందం ప్రశాంతంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం రాత్రి 10 కేజీల స్వామివారి ప్రసాదం లడ్డు వేలంపాట నిర్వహించారు. శనివారం ఆరో తేదీ వినాయక నిమజ్జనం ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. **ప్రజాశక్తి-ఘంటసాల** : కులమతాలకతీతంగా ఘంటసాల గ్రామంలో విగ్నేశ్వర నవరాత్రులు వేడుకలు నిర్వహించటం అభినందనీయమని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. బుధవారం ఘంటసాల విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. చరిత్ర కలిగిన ఘంటసాల గ్రామంలో ముస్లిం సోదరుడు అక్బర్ బాషా వినాయక ఉత్సవాలు నిర్వహించటం శుభపరిణామమని తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాని టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, జడ్పి మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకష్ణ టీడీపీ నాయకులు పరుచూరి సుబాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : గణపతి నవరాత్రుల్లో భాగంగా కంకిపాడు-గన్నవరం రోడ్డులో గడ్డం వారి వీధిలో గడ్డం సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో బుధవారం భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ విజయవాడ పార్లమెంటు ఇంచార్జ్ అమ్మిశెట్టి వాసు , టీడీపీ యువ నాయకుడు బోడే వెంకట్రామ్, పెనమలూరు జనసేన పార్టీ నాయకులు ముప్పా రాజా, టిడిపి సీనియర్ నేత తుమ్మలపల్లి హరికష్ణ, కంకిపాడు కోపరేటివ్ బ్యాంక్ చైర్పర్సన్ సుంకర శివ పాల్గొన్నారు.



ఘంటసాల మండలంలో...



బందరులో...

ఆటో కార్మికుల సమస్యలపై ఉద్యమం

- సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దుర్గారావు

ప్రజాశక్తి-విజయవాడ

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో నెంబర్ 21 రద్దు చేయాలని, అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించాలని కోరుతూ ఈ నెల 9న నిర్వహించే ర్యాలీ, మహాధర్నాలో ఆటో, క్యాబ్ డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు పిలుపునిచ్చారు. బి.ఆర్.టి.ఎస్ రోడ్డులోని నండూరి ప్రసాదరావు భవన్ (సిఐటియు కార్యాలయం)లో విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆటో ర్యాలీ, మహాధర్నా పోస్టర్‌నను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే దశల వారి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రత్యామ్నాయం ఉపాధి కల్పించాలి డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆటో కార్మికులకు ఉపాధి దెబ్బతిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆటో, క్యాబ్ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వాహన మిత్ర ద్వారా ఏడాదికి రూ.25 వేలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9న మీసాల రాజేశ్వరరావు వంతెన సీతన్నపేట సిగ్నల్ పాయింట్ నుంచి చేపట్టే ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నగర నాయకులు బి.రూబెన్ కుమార్, ఎం.హనుమంతరావు, పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు



దసరా ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -విజయవాడ సిటీ

దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు దుర్గగుడి ఈఓ వి.కె.శీనానాయక్ బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రి దిగువన ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లను పర్యవేక్షించారు. క్యూ లైన్ల పనుల పురోగతి గురించి ఈఓకు ఆలయ ఇఇ-2 రాంబాబు వివరించారు. ప్రసాదం పోటు భవనంలో డ్రైనేజీ తదితర సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొండ పైభాగంలో ఏర్పాటు చేస్తున్న పూజా మండపాల పనులను, ఆలయంలోని ముఖ్య ప్రదేశాలలో జరుగుతున్న చిత్రలేఖన పనులను ఈఓ పరిశీలించారు. అన్నదానం భవనం పనులను పరిశీలించి, పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దసరా ఉత్సవాలు పకడ్బందీగా జరిగేందుకు తాను ప్రతిరోజూ ఆలయంలోని ప్రతి విభాగాన్నీ స్వయంగా పర్యవేక్షిస్తున్నానని, యాత్రికులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం తమ ప్రధాన కర్తవ్యమని ఈవో పేర్కొన్నారు.



జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో శారద కళాశాల విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

మొగల్రాజపురంలోని శారద జూనియర్ కళాశాల విద్యార్థి ఆర్.మేధ శ్రీ అమరావతి ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించాడని కళాశాల జనరల్ మేనేజర్ జి. వి.రావు తెలిపారు. జాతీయ క్రీడా పోటీలలో ప్రతిభ కనపరచిన మేధ శ్రీ అభినందన సభ గురువారం సాయంత్రం జరిగింది. ఆగస్టు 24 నుండి 26వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన జాతీయ వాలీబాల్ పోటీలలో తమ విద్యార్థి మేధ శ్రీ ప్రథమ స్థానం సాధించి రూ.లక్ష నగదు బహుమతి కూడా పొందారని తెలిపారు. తమ కళాశాల విద్యతోపాటు విద్యార్థి అన్ని రంగాలలో నైపుణ్యత సాధించే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. తమ విద్యార్థి జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో కూడా ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా శారద విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై.శారద దేవి విద్యార్థులను అభినందించారు.

హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట మండలంలోని తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలను బుధవారం దేవదాయ శాఖ నందిగామ డివిజన్ తనిఖీదారు సమక్షంలో తెరిచి లెక్కించారు. శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం హుండీలలో రూ.3051039లు, శివాలయం హుండీ నుండి రూ.46912లు, అన్నదానం హుండీ నుండి రూ.128996ల ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి సాంబశివరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ భరద్వాజ్ తెలిపారు.

ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు

ప్రజాశక్తి -విజయవాడ సిటీ

విద్యార్థులు చదువుతోపాటుగా ఆటల్లో పాల్గొనడం ద్వారా మనసిక ఉల్లాసం, వత్తిడిని అధిగమించొచ్చనిపొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ చిత్తా అమర్ సుధీర్ తెలిపారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఇంట్రామ్యూరల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం డిపార్ట్మెంట్ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించి అధ్యాపకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో సియస్ఇ విభాగానికి చెందిన అధ్యాపకులు విజేతలుగా నిలిచారు. ఇసిఇ విభాగానికి చెందిన అధ్యాపకులు ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ గ్రంధి పవన్ కుమార్, ట్రెజరర్ రాఘవయ్య, ప్రిన్సిపల్ ఎస్.శరవన్ కుమార్ పాల్గొన్నారు.

పి4 కార్యాచరణలో అద్భుత ఫలితాలు

- కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి- నందిగామ



బంగారు కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

సిఎం చంద్రబాబు నాయుడు ఆలోచనలకు ప్రతిరూపమైన పి4 మార్గదర్శి - బంగారు కుటుంబం కార్యరూపం దాల్చగా నేడు ముప్పాళ్లలో మార్గదర్శుల ద్వారా బంగారు కుటుంబాలకు అందుతున్న సహాయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ ప్రత్యక్షంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శి బంగారు కుటుంబాలతో లబ్ధి పొందుతున్న కొండ్రు వెంకటరావమ్మ, కోట వెంకటరత్నం ఇళ్ళకు బుధవారం కలెక్టర్ జి.లక్ష్మీశ, ఆర్‌డీవో కె.బాలకృష్ణతో వెళ్ళి వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించి, వారి స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు హామీ మేరకు కొండ్రు వెంకటరావమ్మ బంగారు కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలం, ఇంటి మంజూరు, ఆటో, కుట్టు మిషన్, కోట వెంకటరత్నం బంగారు కుటుంబానికి ఆటో ఇప్పించడంతో పాటు పిల్లలను ఉన్నత చదువులు చదివించి పేదరికం నుంచి బయటపడే వరకు మార్గదర్శులు తోడుండేలా చర్యలు తీసుకున్నామన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

- ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ

దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. అజిత్ సింగ్ నగర్, ఆంధ్రప్రభ కాలనీ, ఇన్నర్ రింగ్ రోడ్, నూజివీడు రోడ్, వాంబే కాలనీ, భగత్ సింగ రోడ్డు ప్రాంతాల్లో బుధవారం కమిషనర్ పరిశీలించి, అధికారులకు పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల నిర్మూలనకు ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలని, ఖాళీ స్థలాలలో నీటి నిల్వలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఖాళీ స్థలాల్లో నీరు ఎక్కువైనప్పుడు దోమలు రాకుండా యాంటీ లార్వే ఆపరేషన్లు తీసుకోవటమే కాకుండా, ఆ నీరు పోయేటందుకు గాడి కొట్టి నీరును సహజమైన పద్ధతిలో బయటికి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని. ప్రజలకు దోమల వల్ల అనారోగ్య సమస్యలు వాటిల్లకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లు, కాలువలో పూడికపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసేయటం, పారిశుద్ధ్య కార్మికులు చేరుకోలేని ప్రదేశాలలో డ్రోన్ ద్వారా ఎం.ఎల్ ఆయిల్ స్ప్రే చేయటం వంటి చర్యలు తీసుకొని, ప్రజలకు దోమల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ధ్యానచంద్ర

స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా రేడియాలజిస్టు వరప్రసాద్

- సింగపూర్‌లో జరిగిన 27వ వార్షిక సమావేశంలో బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

ఏషియన్ మస్క్యూలో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా ప్రముఖ రేడియాలజిస్టు డాక్టర్ వి.ఎన్. వరప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించడం శుభపరిణామం అని పలువురు వక్తలు ప్రశంసించారు. ఏషియన్ మస్క్యూలో స్కెలిటల్ సొసైటీ నూతన అధ్యక్షునిగా డాక్టర్ వేమూరి నాగ వరప్రసాద్ నియామకం కావడం, బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇండియన్ రేడియాలజి అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ రోడ్డులోని హోటల్ మినర్వాలో బుధవారం ఆయన్ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పదవి నిర్వహిస్తున్న మొట్టమొదటి భారతీయ రేడియాలజిస్టుగా డాక్టర్ వి.ఎన్.వరప్రసాద్ ఎంపిక కావడం దేశానికి గర్వకారణమన్నారు. డాక్టర్ వి.ఎన్.వరప్రసాద్ మాట్లాడుతూ.. ఆసియా ఖండంలోని వివిధ దేశాల మస్క్యూలో స్కెలిటల్ రేడియాలజీ సంఘాల మధ్య అనుసంధాన కృర్తగా వ్యవహరించేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. శరీరంలోని కీళ్లు, కండరాలు, ఎముకలతో కూడిన ఈ మస్క్యూలో స్కెలిటల్ విభాగం వ్యాధి నిర్ధారణలో ఆధునిక పద్ధతులైన ఆర్టిషిఫీయల్ ఇంటిలిజెన్స్‌తో నూతనంగా రూపొందించిన సిటీస్కాన్, ఎమ్మారై, అల్ట్రాసౌండ్ వంటి పరికరాలు మస్క్యూలో స్కెలిటల్ రేడియాలజీ వైద్యంలో కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. సింగపూర్‌లో జరిగిన 27వ వార్షిక సమావేశంలో తాను ఏషియన్ మస్క్యూలో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. సమావేశంలో ఐఆర్ ఐఎ, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ చలసాని కులదీప్, ఐఆర్ఐఎ విజయవాడ చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-విజయవాడ

ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. విధుల్లో ఉండగా మద్యం సేవించి, ఒక మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు కానిస్టేబుళ్లను నగర పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు బుధవారం సస్పెండ్ చేశారు. నగరంలోని నాల్గవ ట్రాఫిక్ కానిస్టేబుల్ పి.సి. 2702 శ్రీనివాస నాయక్ మద్యం సేవించి యూనిఫామ్‌లో మహిళతో గొడవ పడుతుండగా,

అదే మహిళతో బీటు డ్యూటీలో ఉన్న అజిత్ సింగ్ నగర్ పి.సి 2437 కోటేశ్వరరావు అమర్యాదగా ప్రవర్తించారు. అంతేగాక మద్యం మత్తులో ఇద్దరు కానిస్టేబుళుగొడవపడి క్రమశిక్షణా రాహిత్యంగా ప్రవర్తించినందుకు నగర పోలీసు కమిషనర్ ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు.